

నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలం

● నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవికిరణ్

బొడ్రాయిబజార్, మార్చి 5 : తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ సమస్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవికిరణ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేసి సమస్యలు విన్నవించినట్లు చెప్పారు. ముఖ్యంగా 317 జీఓపై మంత్రికి విన్నవించగా ఆ కమిటీకి తానే చైర్మన్‌గా ఉన్నానని తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారన్నారు.

కొత్తగా ఏర్పాటైన మెడికల్ కళాశాలల్లో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులు పెంచాలని, పీహెచ్ఎన్ ప్రమోషన్ కోసం నర్సింగ్ ఆఫీసర్లకు అవకాశం ఇవ్వాలని, నర్సింగ్ ప్రొఫెషన్‌లో ప్రమోషన్లకు 25 ఏండ్లు వేచి ఉండాల్సి వస్తుందని తెలుపగా త్వరగా ప్రమోషన్స్ వచ్చేలా స్టాఫ్‌ను తీసుకుంటామని తెలిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివసాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ కవిత, రాష్ట్ర కోశాధికారి నరేశ్, కన్వీనర్ వనజ, ఉపాధ్యక్షుడు సలావుద్దీన్, శ్రీలక్ష్మి, స్వాతి పాల్గొన్నారు.

ఎండిన పంట.. పశువులకు మేత

చిలుకూరులో ఎండిన వరి పొలాన్ని కోపిస్తున్న రైతు ప్రభాకర్

చిలుకూరు, మార్చి 5 : పంట చేతికందే దశలో నీరందక పైరు ఎండిపోయింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ రైతు కనీసం గడ్డి అయినా పశువులకు పనికొస్తుందని తలంచి కోత మిషన్‌తో ఎండిన పంటను కోపించాడు. చిలుకూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ ప్రభాకర్ తనకున్న రెండు ఎకరాల పొలంలో నాలుగు బోర్లు వేశాడు. రెండు అరకొరగా నీరు పోస్తుండటంతో ఒక ఎకరం పొలంలో వరి సాగు చేపట్టాడు. పొలం పొట్ట దశకు వచ్చే వరకు నీరు సరిపోయింది. అయితే పంట చేతికొస్తుందన్న తరుణంలో బోర్లు ఎండిపోవడం, కాల్వ నీరు రాకపోవడంతో వరి పైరు ఎండిపోయింది. చేసేదేమి లేక తాలు గింజలు ఉన్న పొలాన్నే పశువులకు గడ్డి కోసం మంగళవారం కోపించాడు. పొలాన్ని చూస్తూ కన్నీటి పర్యంతమైన రైతు గతంలో ఎన్నడూ ఇంతటి కరువును చూడలేదని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు సరైంది కాదు

● సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు

గరిడేపల్లి, మార్చి 5 : అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా వాటిలో సీసీ కెమెరాలు పెట్టాలనడం వారిని అవమానపరుచడమేనని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయడం లేదని, బియ్యం ఉంటే పప్పు ఉండదని, పాలు, గుడ్లు నాణ్యమైనవి రావడం లేదన్నారు. కనీసం పక్కా భవనాలు కూడా లేని అంగన్‌వాడీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయమనడం సరైన చర్య కాదన్నారు. అంగన్‌వాడీ సిబ్బందితో అన్ని పనులు చేయించుకుంటూ వారికి జీతాలు తగిన విధంగా పెంచడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బంది జీతాలు పెంచి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు అంజిరెడ్డి, అప్పయ్య, ఆంజనేయులు, తిరుపయ్య పాల్గొన్నారు.

మఠంపల్లి : సీఎం రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టాలనడం బాధాకరమని సీఐటీయూ మండల కన్వీనర్ రన్‌మియా అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె ఇండ్లలో నడుపుతున్నారని, ఆగస్ట్ 15, జనవరి 26 వేడుకలతో పాటు పుట్టినరోజు, శ్రీమంతాలను అంగన్‌వాడీలు తమ సొంత ఖర్చులతో నిర్వహిస్తూ ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

బి.అన్నారం ప్రైమరీ స్కూల్లో స్వపరిపాలన దినోత్సవం



మిర్యాలగూడ రూరల్ : బి.అన్నారం ప్రాథమిక పాఠశాలలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిర్యాలగూడ రూరల్, మార్చి 5 : మండలంలోని బి.అన్నారం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కుందూరు రత్నాకర్‌రెడ్డి తన తల్లి సుశీలమ్మ జ్ఞాపకార్థం బహుమతులు ప్రదానం చేశాడు. పూర్వ విద్యార్థులు ఆరు కుర్చీలను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వడ్డెపల్లి వెంకటేశ్వర్లు, మాలి సైదులు, ఎస్ఎంఎస్ చైర్మన్ గురువయ్య, ఉపాధ్యాయులు సుశీల, ఇందిర పాల్గొన్నారు.

సౌమ్య పాఠశాలలో..

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యా మందిర్‌లో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 32 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా పాత్రలు పోషించి ఆయా పాత్రలలో మంచి ప్రతిబను కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్, ప్రిన్సిపల్ బొడిగె విజయ్‌కుమార్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, బొడిగె రాణి, మునుకుంట్ల వేణు, ఈరమళ్ల లూసిక, కోనేటి యాదగిరి, మునుకుంట్ల స్వాతి పాల్గొన్నారు.

చిట్యాల: ఉపాధ్యాయులైన విద్యార్థులు

తాగునీటి కోసం మహిళల ఆందోళన

కోదాడ రూరల్, మార్చి 5 : మండల పరిధి దొరకుంట ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. కాలనీలో మంచి నీరు అందించే బోరు ఎండిపోవడంతో కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగినట్లు మహిళలు తెలిపారు.

గ్రామాల్లో మంచినీటి ఎద్దడి

మండలంలోని గ్రామాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొన్నది. ఏ ప్రాంతంలో చూసినా బావులు, చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోయాయి. దాంతో ట్యాంకర్లతో గ్రామాల్లో ఇంటింటికీ మంచినీటిని అందిస్తున్నారు.

దొరకుంట ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం మహిళల ధర్నా

తొగర్రాయి గ్రామంలో ట్యాంకర్లతో ఇంటింటికీ సరఫరా చేస్తున్న మంచినీరు

మహిళా సాధికారతతోనే దేశం అభివృద్ధి

గరిడేపల్లి : వెలిదండలో నినాదాలు చేస్తున్న పీవైఎల్ సంఘం సభ్యులు

● ప్రిన్సిపాల్ వెంకటేశులు

సూర్యాపేట అర్బన్, మార్చి 5 : మహిళా సాధికారతతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎస్‌వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశులు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో రాణిస్తున్న మహిళలను గుర్తించి గౌరవించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇన్‌స్పైర్ ఇంక్లూజన్ థీమ్‌తో మహిళా దినోత్సవం నిర్వహించడం జరుగుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో రేవతి, వినోద్, తేజస్వీని, శాస్త్రీ పాల్గొన్నారు.

మహిళల పట్ల కేంద్ర విధానాలను వ్యతిరేకించాలి

గరిడేపల్లి : మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రతి మహిళా వ్యతిరేకించాలని ప్రగతిశీల మహిళా సంఘం వెలిదండ గ్రామాధ్యక్షురాలు వల్లపుదాసు సంతోషి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని మండలంలోని వెలిదండలో జరిగిన మహిళా సంఘ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో మహిళ పరిస్థితి మరీ దిగజారిందన్నారు. మహిళలపై దాడులను, మతోన్మాదం, కులతత్వం, సామ్రాజ్యవాద విష సంస్కృతిని మోదీ ప్రభుత్వం పెంచిపోషిస్తుందని దుయ్యబట్టారు. కావునా మహిళలంతా ఐక్యమై వారి హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోటు మంగమ్మ, సువార్త, చైతన్య, స్వాతి, శైలజ, భాగ్యమ్మ, రాజేశ్వరి, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలకు నీళ్ల డ్రమ్ముల బహూకరణ

హుజూర్‌నగర్‌లో నీళ్ల డ్రమ్ములు అందజేస్తున్న ఎంఈఓ సైదానాయక్

హుజూర్‌నగర్, మార్చి 5 : వేసవి దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు హుజూర్‌నగర్‌కు చెందిన ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 50 ప్రభుత్వ పాఠశాలకు రూ.20 వేల విలువ గల నీళ్ల డ్రమ్ములను మంగళవారం ఎంఈఓ సైదానాయక్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు సులువ శ్రీను, రణబోతు శ్రీనివాస్‌రెడ్డి, పాలూరి అంజయ్య, రవీందర్, హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాబాషా, షర్మిళ, నరసింహారావు, సైదులు, నాగేశ్వర్‌రావు, బాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హుజూర్‌నగర్, మార్చి 5 : హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం మండలంలోని రాయినిగూడెం, కాల్వపల్లి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక అధికారి డాక్టర్ నగేశ్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మత్తు పదార్థాలు, ఇతర చెడు అలవాట్లకు ప్రజలు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాస్‌రావు, వలంటీర్లు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

● ఆరాధ్య ఫౌండేషన్ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌నాయక్

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి, మార్చి 5 : ఈ నెల 10న మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆరాధ్య ఫౌండేషన్ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జయంతి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండలాధ్యక్షుడు అంబటి రాములు, ఫౌండేషన్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నాగూనాయక్, జిల్లా అధ్యక్షుడు వెంకన్ననాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు సోమ్లానాయక్ పాల్గొన్నారు.

నాగారం శివాలయ కమిటీ అధ్యక్షుడిగా లింగమల్లు

లింగమల్లు

నాగారం, మార్చి 5 : మండల కేంద్రంలోని శివాలయ కమిటీ అధ్యక్షుడిగా బొబ్బలి లింగమల్లు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కన్నెబోయిన అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా చిప్పలపల్లి మల్లేశ్, కోశాధికారులుగా బందారపు ఉపేందర్, కజం సతీశ్, కార్యదర్శులుగా చిప్పలపల్లి ఉపేందర్, కుంభం వెంకటేశ్, సంయుక్త కార్యదర్శులుగా కన్నెబోయిన సంజీవ, అనిల్, బైరబోయిన మహేశ్, ఇతర కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులను ఎన్నుకున్నారు.

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

● తాసీల్దార్ శ్రీనివాస్‌రావు

నూతనకల్, మార్చి 5 : ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలపై పెట్టుకున్న అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ధరణి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మండల వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ తాసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాలకవీడు, మార్చి 5 : మండలంలోని యల్లాపురం గ్రామంలో నెమ్మాది సుజాత అనారోగ్యం ఇటీవల మృతిచెందింది. ఆమె భర్త సైదులు సైతం అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు తీగల శేషిరెడ్డి మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుందరయ్య. చిట్టిబాబు, మహేశ్, సైదులు, ప్రతాప్, వంశీ, బన్నీ, నవీన్ పాల్గొన్నారు.

ఈ 7 నుంచి అనంతగిరిలో రామలింగేశ్వరుడి వేడుకలు

అనంతగిరి, మార్చి 5 : మండల కేంద్రంలోని గంగా పార్వతి, రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి వేడుకలు ఈ 7 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయ అర్చకులు దామూలూరి శంకర్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న ఉదయం అభిషేకాలు, 8న మహన్యాసాపూర్వక ఏకవర రుద్రాభిషేకం, గణపతి పూజ, మహా నివేదన, రాత్రి కల్యాణ మహోత్సవం, 9న గ్రామ సేవా మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండల ప్రజలు ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సూర్యాపేటవాసికి మూడు ఉద్యోగాలు

ఉద్యోగ నియామక పత్రాలతో వినిల్

బొడ్రాయిబజార్, మార్చి 5 : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి నియామక ఉత్తర్వులు అందుకున్నాడు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో దినసరి కూలీ మామిడి భిక్షం అనూరాధ రెండో కుమారుడు వినిల్. ఉన్నత చదువులు చదివి కోరియర్ బాయ్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం ఏదో ఒక పని చేస్తూనే మరోవైపు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇటీవల వెల్లడించిన గురుకుల ఫలితాల్లో వినిల్ జేఎల్ ఇంగ్లీష్, జేఎల్ సివిక్స్, పీజీటీ మూడు ఉద్యోగాలు సాధించి నియామక ఉత్తర్వులు అందుకున్నాడు.

గుండ్లపల్లి లిఫ్ట్‌ను పరిశీలిస్తున్న డీఈ స్వామి

గుండ్లపల్లి లిఫ్ట్‌కు మరమ్మతులు

మఠంపల్లి, మార్చి 5 : మేళ్లచెర్వు మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని మండల పరిధిలోని గుండ్లపల్లి లిఫ్ట్ ద్వారా నీరందించేందుకు మరమ్మతులు చేయనున్నట్లు ఇరిగేషన్ డీఈ స్వామి తెలిపారు. మంగళవారం గుండ్లపల్లి లిఫ్ట్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మేళ్లచెర్వు జాతరకు నీటి సమస్య లేకుండా గుండ్లపల్లి నుంచి వచ్చే లిఫ్ట్ ద్వారా జాతరకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. చౌటపల్లి పంప్‌హౌస్ ద్వారా జాతర ముగిసేంత వరకు మేళ్లచెరువుకు నీటి సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఐడీసీ సీఈడీ ఈఏ వెన్న భద్రారెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది, పలువురు నాయకులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పాలకవీడు : మూసీఒడ్డుసింగారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గోపాల్

పాలకవీడు, మార్చి 5 : మండలంలోని మూసీఒడ్డుసింగారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ గోపాల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25 లక్షతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి పాలకవీడు మండలానికి రూ.3 కోట్ల నిధులు విడుదల చేయగా పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, నాయకులు మోతీలాల్‌నాయక్, బోయబోయిన భిక్షం, వెంకట్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శేషిరెడ్డి, కోటయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దిర్మించర్లలో..

నేరేడుచర్ల : మండలంలోని దిర్మించర్ల గ్రామంలో సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ రాపోలు నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటసైదులు, జయమ్మ, చిన సైదులు, సైదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

నేరేడుచర్ల : దిర్మించర్ల గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ రాపోలు నర్సయ్య

మహిళా పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యం

● ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యల్లయ్య

మున్సిపల్ మహిళా కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 5 : పట్టణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యల్లయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక ఖమ్మం క్రాస్‌రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన సానపల్లి భారతి సంస్మరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. సూర్యాపేట మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో అవార్డులు రావడం వెనుక మహిళా కార్మికుల కృషి ఎంతో ఉన్నదని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య కరుణాకర్, నాయకులు జ్యోతి కరుణాకర్, సుంకరి రమేశ్, సాజిత్‌ఖాన్, నిర్మల, వేల్పుల సుధాకర్, బొల్లంపట్ల అబ్రహం, వల్లపట్ల దయానంద్, మెరుగు మారుతమ్మ, మున్సిపల్ అధికారులు చిప్పలపల్లి శివప్రసాద్, గౌస్ పాల్గొన్నారు.